www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 31 జనవరి 2025
5
వైఎస్ఆర్

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్ : స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై పెద్ద ఎత్తున భారం పడబోతుందని, స్మార్ట్ మీటర్‌ను ఉచితంగా బిగించే తరువాత 90 నెలల వరకు మీటర్ ఖరీదు రేటు బిల్లులో పొందుపరుస్తూ ప్రజలపై భారాలు వేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధమైందని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ విమర్శించారు. గురువారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ రీఛార్జ్ చేసుకున్నట్లు విద్యుత్ కూడా రీఛార్జ్ పరిస్థితి వస్తుందని తెలిపారు. రాత్రి 12, ఒంటి గంటకు గంటకు మనము వేసుకున్న మొత్తం రీఛార్జ్ అయిపోతే విద్యుత్ ఆగిపోతుందని చెప్పారు. ఇటువంటి ప్రమాదకరమైన మీటర్లను డివైఎఫ్ఐ నగర కమిటీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు స్మార్ట్ మీటర్లు బిగించుకోవద్దని, వాటిని బిగించడాన్ని వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తే డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో మీటర్లను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

జమ్మలమడుగులో జాతా ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న గేయానంద్

కడప 'ఉక్కు' కోసం పోరాటాలు

- పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వాలు విఫలం
- విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి
- జమ్మలమడుగు నుంచి ప్రారంభమైన జీపుజాతాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

జీపుజాతా ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

కడప ఉక్కు కర్మాగారం కోసం చేసే పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, పరిశ్రమ ఏర్పాటు చేసే వరకూ పోరాటాలను కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరుగుతున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన కడప ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో గురువారం కడప జిల్లా జమ్మలమడుగు నుంచి తలపెట్టిన రాష్ట్ర జాతాను ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. జమ్మలమడుగు పాత బస్టాండ్‌లో ముందుగా మాజీ ఎంపీ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. జీపుజాతా జమ్మలమడుగులో ప్రారంభమై ముద్దనూరు, పులివెందుల, వేంపల్లె, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల, కమలాపురం మీదుగా రాత్రికి కడప నగరానికి చేరుకుంది. జాతాకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు, నాయకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే సంకల్పాన్ని పాలకపక్ష రాజకీయ పార్టీలు మరిచిపోయాయన్నారు. ఎప్పటికైనా ఉద్యమించి ఉక్కును సాధించుకుంటామని తీర్మానించి ఆశాభావం వ్యక్తం చేశారు. కడప ఉక్కు కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి ఎన్నికల ఎత్తుగడలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇరుక్కుపోయి రాష్ట్ర ప్రయోజనాలను, కడప ఉక్కు పరిశ్రమను తాకట్టు పెట్టాయన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ గురించి జనసేన, టిడివి, వైసిపి పార్టీలు కేంద్రంతో మాట్లాడకపోవడం చాలా బాధాకరమన్నారు. బిజెపి ప్రభుత్వం నిసిగ్గుగా కడప ఉక్కు పరిశ్రమపై ఊసెత్తకుండా ఉండడం ఆంధ్రప్రదేశ్, జిల్లా ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కడపలో బ్రాహ్మణికి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యమైనప్పుడు సెయిల్‌కు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. పరిశ్రమ సాధన కోసం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా పోరాడాలన్నారు. అనంతరం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్, సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి ఏసుదాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఉక్కు పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. అనంతరం ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన వద్దకు చేరుకొని శిలాఫలకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వినయ్, విజయ్, మహేష్, సురేంద్రరెడ్డి, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.శివ నారాయణ, రమణ, సురేష్, భైరవ ప్రసాద్, రఘు, రాజాబుడే, దస్తగిరిరెడ్డి, నరేంద్ర కుమార్, మధు, హరిబాబు, ఖాదర్, చంద్ర, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముద్దనూరు : కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ డిమాండ్ చేశారు. జీపుజాతా సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ విభజన చట్టం హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.50 వేల కోట్లు రాష్ట్రానికి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. పరిశ్రమలు వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు.

పులివెందుల టౌన్ : కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అని సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న అన్నారు. పట్టణంలో పూల అంగళ్ల సర్కిల్‌లో రామన్న, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్ బాషా మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ జిల్లాల్లోని ఒక్కటైన కడప జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మించడానికి పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని కడప జిల్లాలో ఏర్పాటు చేయడానికి నిరాకరించడం దారుణమని పేర్కొన్నారు.

వేంపల్లె : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పీఠం కదిలేందుకు సిపిఎం చేసే పోరాటాల్లో పాలు పంచుకోవాలని కోరారు. సిపిఎం నాయకులు బైరవ ప్రసాద్ మాట్లాడుతూ కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తే దాదాపు లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు ఉంటాయాని చెప్పారు.

ఎర్రగుంట్ల : జిల్లాలో ఉక్కు పరిశ్రమ శిలాఫలకాలికే పరిమితమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఎం సీనియర్ నాయకులు వి.పి.బయన్న అన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో వారు మాట్లాడుతూ 2014లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా ప్రతిపక్ష బిజెపి మద్దతుతో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమకు రాష్ట్రపతి ఆమోదం ప్రకటించడం జరిగిందన్నారు. సెయిల్ సంస్థ ఆధ్వర్యంలో భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని చెప్పి అదే సెయిల్ సంస్థ ఛైర్మన్ ద్వారా తప్పుడు నివేదికను ప్రకటన చేయించారన్నారు. ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ పాదయాత్రలు, సైకిల్ ర్యాలీలు, బైక్ ర్యాలీలు ఇలా అనేక రకాలుగా నిరసనలు తెలియజేస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని వివరించారు.

కడప అర్బన్ : కడప ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో జమ్మలమడుగులో ప్రారంభమైన జీపు జాత రాత్రి కడపకు చేరుకుంది. ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద రాత్రి చేరుకుంది. ఆ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం నగర్ కార్యదర్శి రామ మోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, నాయకులు వెంకటరామయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దూరమవుతున్న విద్య

ప్రభుత్వ విద్యా సంస్థలు నిర్వీర్యం
ఖాళీలతో కునారిల్లుతున్న యూనివర్సిటీలు
హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి
సదస్సులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవికుమార్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవికుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందని, ప్రభుత్వ విద్యా సస్థలను నిర్వీర్యం చేసున్నారని, ఖాళీలు భర్తీ కాక యూనివర్సిటీలు కూనరిల్లుతున్నాయని హక్కుల సాధన కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభల సందర్భంగా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో విద్య మొత్తం బిజెపి చేతిలోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. విద్యను వ్యాపారం చేసి కార్పొరేటీకరణతో డబ్బే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారని విమర్శించారు. యూనివర్సిటీలో వ్యాపార కేంద్రంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు బడి బయట ఉండాలనే కుట్ర చేస్తున్నారని తెలిపారు. 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో డబ్బు ఉంటే ఒక విద్య లేని వాడికి మరో విద్య అన్నట్లు తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు భారమైపోయాయని, తల్లిదండ్రుల ఆదాయం పెరగడం లేదని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2024లో తల్లికి వందనం కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. ఎన్‌సిఆర్‌టి పుస్తకాల్లో చరిత్రను వక్రీకరిస్తూ ముద్రించడం దుర్మార్గం అన్నారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని పేర్కొన్నారు. ఒత్తిడితో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల గుండెచప్పుడుగా ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందని తెలిపారు. డిగ్రీని నాలుగు సంవత్సరాలు చేసి, ఇంటర్నెట్ షిప్ పేరుతో విద్యార్థులకు నైపుణ్యం నేర్పించకుండా బానిసలుగా చూస్తున్నారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్ రవి మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టల్లో మౌలిక వసతులు లేక, పాఠశాల సమయానికి బస్సులు రాక విద్యార్థులు అల్లాడుతూ ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్ ముట్టడి ద్వారా ప్రభుత్వం పై వత్తిడి తీసుకువస్తామని చెప్పారు. విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డిగ్రీ విద్యార్థులకు రూ.3 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఫీజులు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లు కళాశాలలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. సొంత భవనాల్లో ప్రభుత్వ హాస్టళ్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు అలుపెరుగని పోరాటాల నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, విద్యార్థి సంఘం మాజీ నాయకులు కుమారస్వామి, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కంచుపాటి తిరుపాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సుంకర కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికులకు పనిముట్లు కానీ, అడిషనల్ కోవిడ్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన వేతనాలు ఇవ్వకుండా మహిళా కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. 9 మందికి డ్రైవర్లకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించలేదని చెప్పారు. వర్కర్స్ నుంచి ప్రమోట్ అయిన 15 మందిని డ్రైవర్లుగా గుర్తించాలని కోరారు. మాసాపేట రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన కార్మికులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేర్కొన్నారు. రిటర్న్ మాస్టర్ ఎత్తివేయాలని, ఆదివారం సెలవు ఇవ్వాలని తెలిపారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు తక్షణమే ఇవ్వాలని, అడిషనల్ కోవిడ్ కార్మికులకు ఐడికార్డులు ఇవ్వాలని చెప్పారు. అనంతరం ధర్నా శిబిరాన్ని వద్దకు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఇత్తడి ప్రకాష్, సాయి, ఆదామ్, మస్తాన్,దస్తగిరిమ్మ, ధరణి,సాయమ్మ, ఆరోగ్యమ్మ, పెంచలమ్మ,మల్లయ్య, శివ,ఆనందు, కార్మికులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘ కార్యదర్శి సాల్మన్ తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవిని గురువారం తన ఇంటివద్ద కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24కు సంబంధించిన యూనిఫామ్ మంజూరు చేయాలన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వలేదన్నారు. మృతి చెందిన కార్మికులకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వలేదని పిఎఫ్, గ్రాట్యుటీ డబ్బులు రాలేదన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్లస్థలాలిచ్చి, ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కరోనా కార్మికులకు రూ.3వేలు వేతనం చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని సాల్మన్ కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు రమాదేవి, మోహన్, రాంబాబు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు లబ్ధి

ప్రజాశక్తి - చాపాడు : గ్రామాలలో ఉచితంగా ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు ఉపయోగమని మండల పశువైద్య అధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెదురూరులో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పశువైద్య శిభిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 14 పశువులకు చూడి పరీక్షలు, 11 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 56 దూడలకు నట్టల నివారణ మందులు ముందులు, 87 పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు, 23 పశువులకు సాధారణ చికిత్సలు, 6 పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు, 767 జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో చాపాడు పశువైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ గౌస్, విఎల్ఒ వెంకటేశ్వర్లు, జెవిఒ చలపతి, పశువైద్య సహాయకురాలు విష్ణు ప్రియ, మహబూబ్ హుస్సేన్, దస్తగిరి, అమర్నాథ్, లక్ష్మి నారాయణ, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు సత్కారం

ప్రజాశక్తి - కడప : కెనరా క్రేస్ట్ ఖాతాదారులను కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ఐ. పాండురంగ మితంతయ్య, రీజనల్ హెడ్ కె. మురళీమోహన్ సత్క రించారు. కెనరా బ్యాంకు కడప ప్రాంతీయ కార్యాలయం రీజనల్ హెడ్ కే. మురళీమోహన్ ఆధ్వర్యంలో గురువారం కెనరా క్రేస్ట్ ఖాతాదారుల సమావేశం హోటల్ మయూర గార్డెన్ లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సర్కిల్ ఆఫీసు నుంచి జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితంతయ్య హాజరై మాట్లాడారు. కెనరా క్రేస్ట్ ప్రోడక్ట్ లోని లక్షణాలు, లాభాలను వివరించారు. ఈ సందర్భంగా కెనరా క్రేస్ట్ ఖాతా దారులను 105 మందిని సత్కరించారు. రీజనల్ మేనేజర్ కె. మురళీమోహన్ మాట్లాడుతూ క్రేస్ట్ కెనరా ఏంజెల్ అండ్ ఆస్పైర్ మిగతా బ్యాంకు ప్రోడక్ట్ ల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు కస్ట మర్లు, బ్యాంకు మేనేజర్లు, కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, డివి జనల్ మేనేజర్లు ఎస్. రమేష్, విలియం కుమార్, షేక్ అహ్మద్, షఫీక్ పాల్గొన్నారు.

ఖాతాదారులను సన్మానిస్తున్న పాండురంగ

బ్యాంకర్ల సహకారం అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకర్ల ఆర్థిక సహకారం ఉంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, బిసి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా అర్హులైన నిరుద్యోగులకు వివిధ రకాల సెక్టార్ల ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు సబ్సిడీ రుణాలను అందిస్తోందన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 810 యూనిట్లకు, బిసి కార్పొరేషన్ ద్వారా 1863 యూనిట్లకు, కాపు సంక్షేమ కార్పొరేషన్ ద్వారా 'చంద్రన్న స్వయం ఉపాధి' కింద 379 యూనిట్లకు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 1723 యూనిట్ల ఏర్పాటు కోసం ఆయా శాఖలు ద్వారా రుణాలను మంజూరు చేయనుందన్నారు. మార్చి మాసంలో గ్రౌండింగ్ కానున్న ఈ యూనిట్లపై బ్యాంకర్లు, సంబంధిత ఫైనాన్స్ కార్పొరేషన్ల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. కంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక రకాలయిన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ముందుగా డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశానికి సంబంధించిన అజెండా, వివరాలను, పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్ధనం, నాబార్డ్ ఎజిఎం విజయ విహారి, కెనరా బ్యాంకు ఎజిఎం మురళీమోహన్, ఎస్‌బిఐ ఎజిఎం వాణి కిషోర్ కుమార్‌రెడ్డి, ఎపిజిబి ఎజిఎం శ్రీనివాస ప్రసాద్, కెడిసిసి సిఇఒ రాజామణి, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు జిల్లా మేనేజర్లు, ఆర్ఎంలు పాల్గొన్నారు.

తరగతుల తరలింపు తగదు

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల నుండి 3,4,5 తరగతుల తరలింపు సరైన చర్య కాదని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన 117 జీవో వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు 117 జీవో రద్దు కోరుకున్నారన్నారు. గతంలో 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలకు తరలించడానికి వ్యతిరేకించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 117 జీవోను రద్దు చేసి పాఠశాలల పునర్ నిర్మాణ ప్రక్రియ చేపడుతామని హామీ ఇచ్చిందన్నారు.

ఆర్‌ఎంపిలు యాంటీబయాటిక్స్ ఇవ్వరాదు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : ప్రథమ చికిత్సలయాలను నడుపుతున్న ఆర్‌ఎంపిలు యాంటీబయాటిక్స్ వంటి మందులను ఇవ్వరాదని పట్టణ వైద్య అధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో ఆర్‌ఎంపిలు నడుపుతున్న ప్రథమ చికిత్స లయాలను తన సిబ్బందితో కలిసి 16 సెంటర్లలో తనిఖీలు చేశారు. ఆర్‌ఎంపిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించి ఫ్లూయిడ్స్ పెట్టరాదని వారికి తెలిపారు. మందులు నిల్వ ఉంచరాదని చెప్పారు. రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తామని ఆదేశాలను అతిక్రమిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

రూరల్ పరిధిలోని ఆచారి కాలనీకి చెందిన పోచిమరెడ్డి స్వరూప అనే మహిళ స్థానిక వివేకానంద క్లాత్ మార్కెట్ లోని వినాయక శారీస్ సెంటర్లో పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 7.40 గంటలకు పని ముగించుకొని ఇంటికి వెళ్ళడానికి వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా ఆటో ఎక్కి కాలవకట్ట మల్లెల్లమ్మ గుడి దగ్గరదిగారు. ఆటో డ్రైవర్ షేక్ నజీర్ బాషా రాత్రి శ్రీనివాసనగర్ లోని తన ఇంటికి వెళ్లాక తన ఆటోలో ఒక చిన్న బాక్స్ ఉండడానికి గమనించాడు. అందులో సుమారు మూడు తులాలకు పైగా ఉన్న బంగారు తాళిబొట్టు చైను గుర్తించాడు. గురు వారం ఉదయం చైను తీసుకుని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ యుగం ధర్‌కు అందజేశారు. సితన సిబ్బంది సాయంతో సదరు బంగారు తాళిబొట్టు చైను మర్చిపోయిన మహిళను పోచిమరెడ్డి స్వరూపగా గుర్తించి ఆమెకు అప్పగించారు. సుమారు రెండున్నర లక్షల విలువైన బంగారు చైన్ తిరిగి అప్పగి ంచిన ఆటోడ్రైవర్ షేక్ నజీర్‌బాషా నిజాయితీని సిఐ, స్థానికులు అభినం దించారు. ఈ సందర్భంగా సిఐ ఆటోడ్రైవర్‌ను శాలువా కప్పి సత్కరించారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

షెడ్యూల్ కులాలకు సంబంధించి పులివెందుల నియోజకవర్గానికి మూడు షాపులు మంజూరయ్యాయని ఎక్సైజ్ శాఖ సిఐ చెన్నారెడ్డి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ , చక్రాయపేట వేముల మండలాలకు ఒకటి చొప్పున గౌడ కులానికి పులివెందుల , వేముల, ఈడుగ కులానికి చక్రాయపేట కేటాయించారని చెప్పారు. ఆసక్తి కలిగి అర్హులైన వారు ఫిబ్రవరి 5లోపు ఆన్లైన్ ద్వారా కానీ, తమ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6న పరిశీలన ఉంటుందని , 7న లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు కుల ధ్రువీకరణ పత్రం, రూ. 2 లక్షల డిడి తేవాలని పేర్కొన్నారు. షాపు రాకపోతే డిపాజిట్ మొత్తాన్ని వెనక్కి ఇస్తామన్నారు. సంవత్సరానికి పులివెందుల షాపుకు రూ.35 లక్షలు, వేముల, చక్రాయపేట షాపులకు రూ.325000 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తగ్గిన బుడ్డ శనగ దిగుబడులు

ప్రజాశక్తి -సింహాద్రిపురం : ఈ ఏడాది వాతావరణ ప్రభావం కారణంగా గణనీయంగా బుడ్డ శనగ దిగుబడులు తగ్గినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కసనూరు, సింహాద్రిపురం, పైడిపాలెం, సుంకేసుల గ్రామాలలో బుడ్డ శనగ పంటపై పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగుబడులు సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉన్నాయని తెలిపారు. పూత దశలో ఉన్నప్పుడు తుఫాన్ ప్రభావంతోనే అధిక శాతం దిగుబడి తగ్గిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో పైడిపాలెం రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కట్టని చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని వల్లూరు పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు పలు సూచనలు తెలియజేశారు. మండలంలో ఎటువంటి నేరాలు జరగకుండా పగలు రాత్రి మమ్మురంగా గస్తీ నిర్వహించాలని సిఐ రోషన్‌కు సూచించారు. విజిబుల్ పోలింగ్‌లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలని తెలియజేశారు. ఆయన వెంట డిఎస్‌పి వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ దాదిరెడ్డి భాస్కర్ రెడ్డి, కమలాపురం సిఐ రోషన్ ఉన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఆర్థికంగా వెనుకబడిన తరగతులు వారికి స్వయం ఉపాధి కల్పించడానికి సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం కోసం దరఖ్వాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎఒ రామానుజం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వెనుకబడిన తరగతులలో అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 7లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఎపిఒబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు, బలిజ, తెలగ తదితర ఇబిసిలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప



మీడియాతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడపకు వచ్చిన ఆయన చల మారెడ్డిపల్లిలోని ఎంఎస్ఆర్ వ్యాలీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరోనా లాంటి కష్ట సమయంలో కూడా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు డబ్బులు లేవని కుంటి సాకులు చెబుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఇప్పుడు అమలు చేయడం సాధ్యం కాదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి తప్పుడు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో నగర మేయర్ కె.సురేష్ బాబు, వైసిపి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు అమర్నాథ రెడ్డి, డాక్టర్ సుధా, ఎమ్మెల్సీలు డిసి.ఇ గోవింద రెడ్డి, రామ సుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రఘురాంరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి, అంజద్ బాషా, సుధీర్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, జడ్‌పిటిసి నరేన్ రామానుజుల రెడ్డి, పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం.. వైసిపి కార్యకర్తలకు, నాయకులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని వైసిపి రీజనల్ కో- ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం కడప నగరం చలమారెడ్డిపల్లి లోని ఎంఎస్ఆర్ వ్యాలీలో వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి జిల్లా ప్రమాణ స్వీకారం, సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. అట్టహాసంగా నియమితులైన కడప జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేశారు. జగనన్నకు తోడుగా, నీడగా మేమున్నామంటూ గట్టిగా నినదించారు.

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్తులు

అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి

- రోడ్డుపై మృతదేహంతో బంధువులు, గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - గోపవరం

అటవీ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారుల నిర్లక్ష్యంతోనే ఓ నిండుప్రాణం పోయిందని మృతుడి బంధువులు, గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం వారు రోడ్డుపై మృతదేహంతో ఆందోళన చేపట్టారు. దీంతో రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఎస్ఐ శ్రీకాంత్ వారికి ఎంత చెప్పినా వినకపోవడంతో సిఐ నాగభూషణం వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బద్వేల్ మండలం వెంకటశెట్టిపల్లి గ్రామానికి చెందిన బీరం నరసింహారెడ్డి ఒకప్పుడు గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఉండేవారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో బెంగ ళూరు లో పీజీ పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ సర్వేలో భాగంగా ఆయన సొంత గ్రామమైన వెంకటశెట్టిపల్లికి వచ్చారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో పొలంలోకి ఆయన వెళ్లారు. ఎంతసేపటికి రాకపోవడంతో వారి కూతురు బంధువులు పొలం దగ్గ రికి వెళ్లి చూడగా ఆయన మృతదేహం కన్పించింది. ఒక్కసారిగా వారు కన్నీరు మున్నీరయ్యారు. బంధువులు చెప్పిన వివరాల మేరకు వన్య మృగాల కోసం వేసిన విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పొలం దగ్గర్నుండి రెండు కిలోమీటర్లు మృతదేహాన్ని ఈడ్చి కెళ్ళి చెట్ల పొదల్లో వేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మూడేళ్లు అక్రమంగా వన్య మృగాల వేట గాళ్ల వేసిన విద్యుత్ వైర్లకు ముగ్గురు వ్యక్తులు చనిపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు నాలుగో వ్యక్తి చనిపోయారని చెప్పారు. గతంలో ఎన్నోసార్లు విద్యుత్, ఫారెస్ట్ అధికారులకు, పోలీసులకు ఈ వేటగాళ్ల విషయమై ఫిర్యాదు ఫిర్యాదు చేసిన పట్టిం చుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే మరో ప్రాణం పోయిందంటూ వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియాపై అవగాహన

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : పులివెందుల అర్బన్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల వసతి గృహంలో ఫైలేరియా వ్యాధిపై సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా అనేది పరాన్నజీవుల వల్ల కలిగే అంటువ్యాధి అన్నారు. ముఖ్యంగా ఫైలేరియా క్రిముల (ఫైలేరియల్ వర్మ్) ద్వారా సంభవిస్తుందన్నారు. వీటి సంక్రమణకు క్యూలెక్స్ దోమ కాటు వల్ల వస్తుందని తెలిపారు. ఫైలేరియా వ్యాప్తి విధానం, దోమలు ఫైలేరియా లార్వాలను మానవ రక్తంలోకి ప్రవేశపెడతాయని చెప్పారు. లింఫ్ నాళాలు కదలకుండా చేసి అవయవాలను పూతలా ఉబ్బించేస్తాయని, దీని వల్ల చాలా పెద్దగా వాపు శారీరక బాధలు ఏర్పడతాయని వివరించారు. రాత్రివేళలు ఎక్కువగా జ్వరం, చలి వణుకు, శరీర భాగాలలో స్వల్ప వాపు, ఒళ్లంతా నొప్పులు, తీవ్ర స్థాయిలో పాదాలు చేతులు, గోళ్లు, పెద్దగా మారడం, శరీర అవయవాలు స్థిరంగా పెద్దవిగా మారడం లక్షణాలని తెలిపారు. దీర్ఘకాలం చికిత్స తీసుకోకపోతే ముందుగా నడవడం కూడా కష్టం అవుతుందన్నారు. దోమలను పూర్తి స్థాయిలో నివారించడానికి శుభ్రత, పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి లక్ష్మి శైలజ పాల్గొన్నారు.

బిటెక్ రవి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : పులివెందులలో అడుగడుగునా అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నది టిడిపి నాయకులేనని, మెడికల్ కాలేజ్‌కు వచ్చిన 50 సీట్లు వెనక్కి పంపించిన ఘనత కూడా కూటమి ప్రభుత్వందేనని, బిటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిషోర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోళ్ల భాస్కర్ పేర్కొన్నారు. గురువారం జగన్ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు 90 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ఉన్న 10 శాతాన్ని ఎనిమిది నెలలు గడిచినా కూడా కూటమి ప్రభుత్వంలో ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. పట్టణంలో నిలిచిపోయిన అండర్ డ్రెయి లనేజీ, రోడ్ల విస్తీర్ణత, సెంటర్ బోలె వార్డు పనులు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చామన్నారు. రేషన్ తెచ్చుకునేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పులివెందులలో నిలిచిపోయిన పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకురావాలన్నారు. చేతనైతే నిధులు తెప్పించి పులివెందులను బెస్ట్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని హితవు పలికారు. కార్యక్రమంలో రసూల్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'రాచమల్లు'కు మాతృవియోగం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి తల్లి రాచమల్లు మునిరత్నమ్మ (82) గురువారం ఉదయం మృతి చెందారు. హైదరాబాద్‌లో ఉన్న రాచమల్లు ప్రసాదరెడ్డి సోదరుడు కిరణ్‌రెడ్డి స్వగృహం నుంచి ఆమె జనరల్ చెక్‌అప్ కోసమని కార్‌లో బయలుదేరారు. సీట్లో కూర్చున్న కొద్దిసేపటికి కుప్పకూలిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలి పారు. మునిరత్నమ్మకు ముగ్గురు సంతానం పెద్దకుమారుడు కిరణ్‌రెడ్డి, కాగా చిన్నకుమారుడు ప్రసాదరెడ్డి, ఒక కూమార్తె ఉన్నారు. రెండు రోజల కిందట ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా అన్ని సక్రమంగా ఉన్నట్లు నివేదిక వచ్చిందని తెలిపారు. మునిరత్నమ్మ అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తామన్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి -ఖాజీపేట : మండల పరిధిలోని బోసిరెడ్డిపల్లె దళితవాడ ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన సంఘటనలో బత్తిని హరికృష్ణ(26) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. బద్వేల్‌కు వెళ్లేందుకు బోసిరెడ్డిపల్లె దళితవాడ వద్ద సిద్ధంగా ఉన్న బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో నంద్యాల జిల్లా గడివేముల మండలం తిరుపాడు గ్రామానికి చెందిన హరికృష్ణ మృతి చెందాడు. మృతుడికి ఇటీవలే వివాహమైందని, భార్య, ఓ చిన్నారి ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

టిప్పర్, లారీ ఢీ.. డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి - ముద్దనూరు : కడప- తాడిపత్రి ప్రధాన రహదారిలోని గంగాదేవిపల్లె వద్ద లారీ, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వి.ఎన్.పల్లెకు చెందిన లారీ డ్రైవర్ నాగసుబ్బారెడ్డి (35) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికు వివరాల ప్రకారం.. ఎర్రగుంట్లకు చెందిన లారీ తాడిపత్రి నుంచి నాపరాళ్ళ లోడుతో ఎర్రగుంట్లకు బయలుదేరంది. మండలంలోని గంగాదేవిపల్లె వద్ద వస్తుండగా ముద్దనూరు నుంచి కొండాపురం వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ఎదురె దురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. వి.ఎన్.పల్లెకు చెందిన లారీ డ్రైవర్ నాగసుబ్బారెడ్డి క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి దుర్మణం చెందాడు. విషయం తెలుసుకున్న సిఐ దస్తగిరి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని హోంగార్డు రంగనాయకులు క్రేన్, జెసిబి సాయంతో లారీలో ఇరుక్కున మృతదేహాన్ని వెలికి తీశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఎర్రగుంట్లకు చెందిన టిప్పర్ డ్రైవర్ కిరణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ నాగసుబ్బారెడ్డి మృతదేహం

జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళి

కడప : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రవీంద్రనాథరెడ్డి

ప్రజాశక్తి - కడప

దేశం కోసం తన జీవితాన్ని ధారపోసిన జాతిపిత మహాత్మా గాంధీ త్యాగం చరిత్రలో అమరత్వంగా నిలిచిపోయిందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. గురువారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన శాంతి, అహింస, సమానత్వం అనుసరణీయ మార్గాలని సాగించారు అన్నారు. దేశ స్వాతంత్రం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీని అప్పటి ఆర్ఎస్ఎస్ నాయకుడు గాడ్సే పొట్టన పెట్టుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కడప కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు కమల్ భాష, జహెూర్ , హమీద్, ఖాదర్ ఖాన్ ,ఆబిద్, రహమతుల్లా ఖాన్, బాబ్జి పాల్గొన్నారు. **వైసిపి ఆధ్వర్యంలో..** మహాత్మా గాంధీ సూచించిన అహింస పద్ధతిలో రాష్ట్రంలో నెలకొన్న రెడ్ బుక్, అవినీతి దుర్మార్గపు పాలనను తరిమికొడదామని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమలాపురం వైసిపి ఇన్‌ఛార్జి నరేన్ రామాంజనేయులురెడ్డి, కార్పొరేటర్లు మొహమ్మద్ షఫీ,అజ్మతుల్లా, జిలాన్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్ పాల్గొన్నారు. **వేంపల్లె :** మహాత్మా గాంధీ జాతి పిత మాత్రమే కాదని ప్రపంచ నేతనని మాజీ రాజ్యసభ సభ్యుడు ఎన్. తులసిరెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు గురువారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింస, సత్యాగ్రహం ,నిరాడంబరత అనబడే గాంధీజీ ఆయుధాలకు కాల దోషం లేదని అన్నారు. అవి సార్వ కాలీనం, సార్వ జనీనం, సార్వ ప్రాంతీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ధృవ కుమార్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, బద్రినాథ్, ఉత్తన్న, వెంకటేష్, వేమయ్య, రవి, ఐచర్ రమణ, రాజు, వినయ్, వెంకట వినయ్ పాల్గొన్నారు.

జాతిపిత మహాత్మాగాంధీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని టిడిపి నేత డాక్టర్. డివి సుబ్బారెడ్డి పేర్కొన్నారు.స్థానిక పులివెందుల రోడ్డులోని డివి సుబ్బారెడ్డి ఆసుపత్రిలో జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురష్కరించుకొని గాంధీ చిత్రపటానికి టిడిపి నేతలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల పట్టణ అధ్యక్షుడు ఆర్.వి. రమేష్, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ, ఏమి రెడ్డి కృష్ణారెడ్డి, భాను కిరణ్ రాయల్, గోపాల్ రెడ్డి, ప్రకాష్, సింగంశెట్టి సురేష్, బాబా, కరిముల్లా, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని గాంధీ సర్కిల్ లో ఉన్న ఆయన విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర రెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, ఇతర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ , కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, ఇస్మాయిల్, ఇంతియాజుద్దీన్ పాల్గొన్నారు. టిడిపి నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాములు యాదవ్, మైదుకూరు నియోజకవర్గం బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఏసుపాదం, పుల్లారెడ్డి పాల్గొన్నారు. **కాశినాయన :** గాంధీజీ వర్ధంతి సందర్భంగా పోరుమామిళ్లలో గాంధీజీ విగ్రహానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ గౌసియాభేగం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు . కార్యక్రమంలో సిపిఎం పోరుమామిళ్ల మండల కమిటీ సభ్యులు బీవి లూర్ధుమేరి ఓబులమ్మ రవి మరియమ్మ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** జాతి పిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు, ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శనీయమని వాసవి క్లబ్ సిరిపురం అధ్యక్షుడు పద్మానాభయ్య తెలిపారు. గురువారం స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ కాసంశెట్టి సుధాకర్ గుప్తా, రీజియన్స్ సెక్రటరీ మేడా కామేశ్వరరావు, వాసవి క్లబ్ సెక్రటరీ బచ్చు అశోక్ కుమార్, వాసవి క్లబ్ మెంబర్,జయం గోపాల్ పాల్గొన్నారు.

వేంపల్లె : గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

'సీమ'లో రాజధాని నిర్మాణానికి భూములిస్తాం

- పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం రాయలసీమలో రాజధాని నిర్మిస్తే గట్టి భూములు ఇచ్చేందుకు సీమ వాసులు సిద్ధంగా ఉన్నారని పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి స్వగృహానికి ఆయన విచ్చేశారు. అనంతరం తులసిరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి కోసం బుదరద నేలల్లో, గుంతల్లో ఎందుకు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. అమరావతిలో నగరం సృష్టించడానికి వందేళ్లు పడుతుందని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నంత మాత్రాన అది నగరం కాదన్నారు. రాయలసీమ బిడ్డగా తాను అడుగుతున్నానని, రాయలసీమలో గట్టి నేలలాలు, చిరకాలం పాటు ఉండే నేలలను రాజధాని నిర్మాణం కోసం భూములను ఇస్తామని చెప్పారు. రాయలసీమకు చరిత్ర అనేది ఉందన్నారు. రాయలసీమలోని ఏ జిల్లాలోనైనా రాజధానిని తెచ్చి పెట్టితే సహకరిస్తానని చెప్పారు. కర్నూల్‌లో బెంచ్ అవసరం లేదని హైకోర్టు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ అమలు చేసేందుకు కూటమి గానే ఎన్నికల్లో పోటీ చేసింద న్నారు. చేయడం జరిగిందని చెప్పారు. ధైర్యంగా సూపర్ సిక్స్ పథకాలకు నిధులు మంజూరు చేయాలని నరేంద్ర మోడీని చంద్రబాబు నిలదీయాలని చెప్పారు. . రాష్ట్రంలో కూటమి పాలన పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని ఎద్దేవా చేశారు సంపదను సృష్టించేందుకు మార్గాలను వెతకాలని కోరారు. దావోస్ నుండి పైసా తీసుకొని రాక పోయిన తాము బాధపడలేదని చెప్పారు. సమావేశంలో పులివెందుల నియోజకవర్గం సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి, అనంతపురం మాజీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, తిరుపాల్ రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, వేమా నాగరాజ, వెంకటేష్, రాజు, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శైలజానాథ్

నకిలీ పట్టాలు సృష్టిస్తున్న ముఠాను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

స్థానిక సుందరయ్య కాలనీలో నకిలీ పట్టాదారుల దౌర్జన్యాలను అరికట్టాలని, దొంగ పట్టాలు తయారు చేస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సుందరయ్య కాలనీ వాసులైన సగిలి అంబేద్కర్, కుంభగిరి పుల్లయ్య, ఇండ్ల చంద్రకళ, చుప్పల వెంకటరమణ సంయుక్తంగా మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట బద్వేలు మున్సిపాలిటీ 18వ వార్డులో సిపిఎం ఆధ్వర్యంలో భూపో ఃరాటం చేసి స్థిర నివాసాలు ఏర్పరచుకుని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ఇక్కడే సంసారాలు ఉంటున్నామని తెలిపారు. కాలనీ ఏర్పాటు దశలో ఈ స్థలం నివాసయోగ్యంగా లేనప్పటికీ, రాళ్లు రప్పల, విష సర్పాల నడుమ జీవనం సాగిస్తూ, మౌలిక సౌకర్యాలు లేక అనేక రకాలైన ఇబ్బందులను ఎదుర్కొన్నామని చెప్పారు. సిపిఎం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన పోరాటాల ద్వారా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో తాము నివాసం ఉన్న ఇళ్లకు డోర్ నెంబర్లు, కరెంటు మీటర్లు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. అనేక సంవత్సరాలుగా పన్నులు చెల్లిస్తూ సంబంధిత స్థలంలో తాము అనుభవంలో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం కాలనీలో బ్రహ్మ సాగర్ మంచినీటి పైపులైన్లు, సిమెంటు రోడ్డులు, వీధి దీపాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇప్పుడు కడప నగరంలో నివాసముంటున్న షేక్ చాంద్ బాషా అనే వ్యక్తి సదరు కాలనీలో 8 పట్టాలు ఉన్నాయని, కొందరు రౌడీలను వెంటవేసుకొని తమ ఇళ్లపైకి వచ్చి మహిళలు, ముసలి వాళ్ళని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్లు అసభ్యకరంగా మాట్లాడారన్నారు. ఈ స్థలాలు ఖాళీ చేయాలని, ఇంటి నిర్మాణాలను జెసిబిలతో కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. గతంలో పట్టణంలో దొంగ పట్టాలను తయారు చేసే ముఠాను గుర్తించి కేసులు నమోదు చేసినప్పటికీ కొంత మంది తప్పించుకొని తిరుగుతున్నారని, వారిన అరెస్టు చేసి 25 సంవత్సరాలుగా స్థిర నివాసాలు ఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాలనీవాసులు

కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలో ఉన్న కాపు సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్ నిర్మించుకునేందుకు ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయించాలని వేంపల్లె మండల టిడిపి ఉపాధ్యక్షుడు వీరబద్ర, వేమా కుమార్ కోరారు. గురువారం పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని కమ్యూనిటీ హాల్ స్థలం కోసం టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, వేమాకుమార్ వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం కాపు సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించి భవనం కూడా నిర్మిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేశారని పేర్కొన్నారు. కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు రెవెన్యూ అధికారులతో చర్చించి తప్పకుండా స్థలం మంజూరు చేయిస్తానని బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి కాపు నాయకులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బలిజ సంఘం ఉపాధ్యక్షుడు యడాల రామచంద్ర ఉన్నారు.

పశు వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీ పశు వైద్య కళాశాలలో గురువారం మార్టిన్ డే పురస్కరించుకొని పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థులు ఉపాధ్యాయులు ముందుకు రావడంతో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఒక యూనిట్ రక్తదానం వల్ల ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఇక్కడి విద్యార్థులు అధ్యాపకులు మూగజీవులకు సేవ చేయడమే కాకుండా మనుషులకు కాపాడే బహుత్తర కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులను అభినందించారు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ వాణి, డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు డాక్టర్ రాజకిషోర్ పాల్గొన్నారు.

రాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No. 394/2024 And I.A.No. 118/2024

O.S.No. 394/2024

తమ్మిశెట్టి పెద్ద వెంకట సుబ్బయ్య. ...వాది(పిటీషనర్)

Vs

1. శ్రీ గునుకుంట్ల సరోజ & నలుగురు ఇతరులు.

...ప్రతివాదులు (రెస్పాండెంట్లు)

పై దావాలోD1కు పత్రికా ముఖముగా సమను & I.A.No. 118/2024లో R1కు పత్రికా ముఖముగా నోటీసు

To

D1. శ్రీమతి గునుకుంట్ల సరోజ, W/o చిన్నసుబ్బారెడ్డి, గృహిణి, గూడావాండ్లపల్లి, H/o బుగ్గలపల్లి, సికెదిన్నె మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

అను మీరు 1వ ప్రతివాదిగను మరియు నలుగురు మీద, వాది దావా దాఖలా 4 ఐటముల మీద తనకు పర్మనెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు పాలించమని దావా సలుపగా, సదరు మీ యొక్క హాజరుకు గాను 24.02.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు తేదీన మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై, మీకు ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపు కోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించదరు.

అలాగే, సదరు దావాలో Ex-Party ad-interim Temporary Injuction ఉత్తర్వులు కోరుచూ I.A.No.118 /2024ను సలుపగా, సదరు I.A.లో రాజశ్రీ కోర్టువారు టెంపరరీ ఇంజక్షన్ ఉత్తర్వులు మీ మీద మరియు 2&3వ రెస్పాండెంట్ల మీద పాలించి వున్నారు. సదరు I.A.లో మీ యొక్క హాజరు మరియు అభ్యంతరములను 24.02.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 24.02.2025వ తేదీ మీరు ఖుద్దున గాని/ వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై తెలుపుకోనంతట, పై I.A.ని మీ పరోక్షముగా తీర్మాణించదరు.

ది: 30.01.2025

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్ బాబ్జీ

వకీలు, కడప.

రాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 23/2022

1) పేర్ల పార్వతమ్మ W/o late శివారెడ్డి చనిపోయినందున ఈమెకు వారసులు రీత్యావారసులు 2&5 వాదులు.
2) పేర్ల గోపీనాథ్ రెడ్డి S/o late శివారెడ్డి D.No.2/554 శాస్త్రి నగర్, ప్రొద్దుటూరు.
3) కందుల మహేశ్వరి W/o రాజమోహన్ రెడ్డి రేడియో స్టేషన్ పక్కన, జిల్లా కోర్టు రోడ్డు కడప.
4) కే.లక్ష్మీదేవి W/o మంజునాథ రెడ్డి H.No.52 4వ క్రాస్ 5వ ఫేజ్ రాజాజీ నగర్,శవర్నహళ్లి బెంగళూరు.
5) కే.పద్మావతి W/o మల్లికార్జున రెడ్డి H.No.52 4వ క్రాస్ 5వ ఫేజ్ రాజాజీ నగర్, శవర్నహళ్లి, బెంగళూరు.

...వాదులు

Vs

5) సానేపల్లి లలితమ్మ W/o లేట్ సూరారెడ్డి 65 సం.లు
12)సానేపల్లి@ M.లోకేశ్వరి 65సం.లు W/o మధుసూదన్ రెడ్డి త్యాగరాజు రెడ్డి హాస్పిటల్ వెనుక ప్రొద్దుటూరు
17)పేర్ల లక్ష్మి, W/o లేట్ చంద్రశేఖర్ రెడ్డి 52 సం.లు
18)పేర్ల చైత్రరెడ్డి, D/o చంద్రశేఖర్ రెడ్డి 15సం.లు మైనర్
19 పేర్ల యజ్ఞరెడ్డి S/o చంద్రశేఖర్ రెడ్డి 15సం.లు మైనర్
18, 19 ప్రతివాదులు మైనర్లు అయినందున గార్డియన్ వీరి తల్లి 17వ ప్రతివాది 5,17,18, మరియు 19 ప్రతివాదులు D.No.4-81-సి, మహాత్మా నగర్ ఎర్రగుంట్ల.

...ప్రతివాదులు 5,12,17 to 19

దావా సమన్స్

దావాలోని వాదులు మీ పైన మరియు మిగతా ప్రతివాదులు పైన దావా ఆస్తులను బాగా పరిష్కారం కోరుచూ 2134/2017 నంబరు గల దాన దస్తావేజు మరి యు 2412/2020, 2413/2020 మరియు 2411/2020 నంబర్లు గల విక్రయ దస్తావేజులను రద్దు చేయవలెనని మరియు దావా ఆస్తులను భాగ పరిష్కారం చేయవలెనని కోరుచూ దావా దాఖలు చేసినారు ఇందులో మీలో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 25/2/2025వ తేదీన పగలు ఉదయం 10:30 నిమిషములకు హాజరై తెలుపుకొనవలెను. లేనంతట దావా మీ పరోక్షముగా తీర్మానించబడును.

సి.సుదర్శన రెడ్డి

అడ్వకేట్,

వై.ఎం.ఆర్.కాలనీ, ప్రొద్దుటూరు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

'కుష్టు' అంటు వ్యాధి కాదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కుష్టువ్యాధి అ ంటువ్యాధి కాదని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌కాంత్ అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటి (సిర్డ్స్) ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి గ్రస్తులకు గాంధీ ఎనలేని సేవలందించారన్నారు. వారి పట్ల ప్రేమ చూపారన్నారు. ఆశ్రమంలో రోగుల గాయాలను తన చేతులతో శుభ్రపరచి కుష్టువ్యాధి సోకదు అని తెలియజేశారన్నారు. డిపిఎంఒ శివశంకరయ్య మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు .కుష్టురహిత సమాజం కోసం ప్రతిప ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిర్డ్స్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, యుపిహెచ్‌సి సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

కార్నియాలను సంస్థల నిర్వాహకులకు ఇస్తున్న కుటుంబ సభ్యులు, మల్లమ్మ (ఫైల్‌ఫొటో)

నేత్ర దానంతో ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - వేముల

వేముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చందా మల్లమ్మ (85) గురువారం మరణించారు. ఆమె కుమారులు మల్లిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగ మల్లారెడ్డి, కోడళ్ళు పార్వతి, నాగ రత్నమ్మ, లీలావతి, మనవల్లు మల్లారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, మనవరాళ్లు మహేశ్వరి, డాక్టర్ సుకన్య, మారుతీ, వెన్నెల నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి గ్రామానికి వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిది పంపారు.. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన సమయంలో నేత్రదానం పై అవగాహన కలిగి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలను దానం చేస్తే అంధులకు చూపు ఇచ్చిన వారవుతారన్నారు. సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

ప్రగతిపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి - వేముల : మండలం స్థానిక శ్రీ శక్తి భవన్‌లో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌ల ప్రగతి సమీక్ష సమావేశాన్ని గురువారం వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజ్‌కి అర్హత కలిగిన ప్రతి స్వయం సహాయక సంఘానికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. డ్వాక్రా మహిళలు వ్యక్తిగతంగా నిర్వహించుకునే వ్యాపార కార్యక్రమాలకు వ్యక్తిగత రుణాలను నారీ శక్తి స్వయం సిద్ధ రుణాలను, శ్రీనిధి రుణాలు అనుసంధానం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తున్న బిసి కార్పొరేషన్, ఎస్‌సి కార్పొరేషన్, ఎస్‌టి కార్పొరేషన్ సబ్సిడీ రుణాల పైన మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అర్హతలు కలిగిన వారికి ఆన్‌లైన్‌లో రుణ దరఖాస్తు ఫారాలను నమోదు చేయించే విధంగా మార్గ నిర్దేశం చేయాలని కోరారు కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు జ్యోతి జైపాల్, నాగేశ్వరి, గంగరాజు, మండల సమాఖ్య అకౌంటెంట్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని శ్రీపాద శ్రీవల్లభ అక్క సేవా సమితి అధ్యక్షులు కొండల భరద్వాజరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం రేకులకుంట, పెద్దరాసుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవాసమితి ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు 'న్యూ మోడల్ టెస్ట్ పేపర్' బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దృష్టిలో ఉంచుకొని బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. అమ్మ సేవా సంస్థ అధ్యక్షులు వాగ్దాన శివ శంకర్ మాట్లాడుతూ దాతల సహకారంతో సేకరించిన న్యూ టెస్ట్ మోడల్ బుక్స్ ను ప్రతి ఒక్క ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, శశిధర్ పాల్గొన్నారు

భారతీయ స్టేట్ బ్యాంక్

CAC బ్రాంచ్ 61432, కడప.

భారతీయ స్టేట్ బ్యాంక్, CAC బ్రాంచ్ వారు నగదు సరఫరా కొరకై బ్యాంక్ నియమ నిబంధనలను అనుసరించి, నెలవారీ అద్దె చెల్లింపు పద్ధతిపైన, క్రింది ఉదహరింపబడిన, ప్రత్యేక డిజైన్ చేయబడిన రెండు క్యాష్ వ్యాన్స్‌కై సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.

క్యాష్‌వ్యాన్స్ కడప ఆపరేషన్ ఏరియా పరిధిలోని సుమారు 25 బ్రాంచ్‌ల అవసరం మరియు అభ్యర్థన ప్రకారం, సెలవురోజులతో సహా అన్ని రోజులలో బ్రాంచ్‌లకు నగదు సరఫరా చేయుటకు పనిచేవలసి ఉంటుంది. ఆసక్తిగల వ్యక్తులు/ పార్టీలు, వాహనము వివరాలు మరియు స్పెసిఫికేషన్స్‌తో కోరుకున్న నెలవారి అద్దెను తెలియజేస్తూ తేది: **10.02.2025 సాయంత్రం 5 గం॥లలోగా** సీల్డ్ కవర్లలో పోస్ట్ ద్వారా గాని, స్వయంగా SBI CAC బ్రాంచ్‌లో గాని దరఖాస్తు చేయవచ్చును. తేదీ : **10.02.2025 సాయంత్రం 5 గం॥లలోగా** అందిన దరఖాస్తులు మాత్రమే పరిగణించబడతాయి.

వాహనం స్పెసిఫికేషన్లు (1) తయారీ మరియు మోడల్ (a) ఇది LCV (లైట్‌కమర్షియల్ వెహికల్) అయి ఉండి 2200cc కంటే తక్కువ కాకుండా ఇంజిన్ కెపాసిటీతో ప్రధాన టర్బోచార్జ్‌డ్ అయి ఉండాలి. (b) వాహనం అద్దెకు తీసుకున్న సమయంలో 02 సంవత్సరాలకు మించకుండా మరియు ఏ సమయంలోనైనా 5 సం॥లకు కంటే ఎక్కువ కాకుండా పాతదై ఉండరాదు. (c) గ్రౌండ్ క్లియరెన్స్ 190mm కంటే తక్కువ ఉండరాదు. (d) వాహనంలో కనీసం (1+4) మంది ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా ఉండాలి. (ఫ్యాక్టరీబిల్ట్) (e) వాహనానికి డ్రైవర్ / ప్రయాణీకుల కోసం (04) తలుపులు ఉండాలి. (f) అన్ని తలుపులకు లోపల నుంచి మరియు వెలుపల నుంచి ఇండిపెండెంట్ లాకింగ్ సిస్టమ్ ఉండాలి. (g) స్టెప్నితోపాటు ట్యూబ్‌లెస్ టైర్లు ఉండాలి. (h) చక్రాలు ఓపెన్ చేయడానికి మరియు చిన్న మరమత్తులకు జాకీ మరియు హేండిల్ మరియు టూల్స్ గల పూర్తి టూల్‌కిట్ ఉండాలి. (i) ఫ్యాక్టరీ ఫిట్టెడ్ ఎయిర్‌కండీషనర్ ఉండాలి. **(2) లేఅవుట్** (a) బాడీ కనీసం 19 గేజ్ షీట్ మెటల్ అయి ఉండాలి. అయితే ఫ్లోర్ కనీసం 16 గేజ్ మెటల్ ప్లేట్ కలిగి ఉండాలి. (b) క్యాష్ కేజ్ ఫ్లోర్‌పై కనీసం ఐరన్ ఐలెట్స్ ఉండాలి. అవి దిగువ నుంచి బానెట్‌కు బోల్ట్ చేయబడి తగిన డయామీటర్ (అంటే 2, 2.5) కలిగి వుండాలి. క్యాష్ కేజ్‌లో మల్టీపుల్ క్యాష్ బాక్స్ స్టాక్స్ ఉంచడానికి వీలుగా ఉండే ఐలెట్స్ మధ్య స్పేస్ ఉండాలి. (c) డ్రైవర్ క్యాబిన్ 2 సీట్లు వరసలు ఉండాలి. డ్రైవర్స్ మొదటి వరుస ఒక బ్యాంక్ గార్డ్ (కో-డ్రైవర్) ఉండాలి. మరియు ఒక ఆర్మ్‌డ్ గార్డ్ మరియు ఇద్దరు ఇతర సిబ్బందికి వెనుకవరుస ఉండాలి. **(3) క్యాష్ కంపార్ట్‌మెంట్ సెక్యూరిటీ :** (a) క్యాష్‌కేజ్ కంపార్ట్‌మెంట్‌కు తలుపు రూము గ్రిల్ ఉండాలి. (b) కేజ్ ప్రవేశం వ్యాన్‌కు ఎదురువైపు నుంచి ఉండాలి మరియు వెనుక భాగం పూర్తిగా మూసి ఉండాలి. (c) **లాకింగ్ ఏర్పాటు** క్యాష్ క్యాబిన్ డోర్‌కు ఒక ఇంటర్నల్ లాక్ మరియు 2 ప్యాడ్ లాక్స్ ఉండాలి. (d) అన్ని కిటికీలు మరియు విండ్ స్క్రీన్‌కు విండ్‌షిప్ రక్షణ (1 స్కేర్ ఇంచ్‌లు కంటే ఎక్కువ కాకుండా) ఉండాలి. ప్రతి విండోమెష్‌కు ఆయుధం ఉపయోగించడానికి 6 అంగులాల సర్క్యులర్ పోర్ట్ హోల్ ఉండాలి. **(4) డ్రైవర్ క్యాబిన్ :** (a) దీనిలో మొబైల్ చార్జింగ్ సదుపాయం ఉండాలి. (b) GPS తో CCTV సిస్టమ్ అమర్చబడి ఉండాలి. మరియు 30 రోజుల రికార్డింగ్ సదుపాయం మరియు దిగువ విధంగా 03 కెమెరాలు ఉండాలి. (i) వెనువైపు (ii) ముందు వైపు (iii) క్యాష్ కంపార్ట్‌మెంట్ (c) రక్షణ నిమిత్తం హూటర్ ఉండాలి. (d) తగిన ఫస్ట్‌ఎయిడ్ కిట్‌తో ఒక ఫస్ట్ ఎయిడ్ కిట్ డ్రైవర్ సీట్ వద్ద అమర్చబడి ఉండాలి. (e) డ్రైవర్ సీటు సమీపాన ఒక ABC టైప్ (స్టోర్డ్ ప్రెజర్) 2. కె.జి ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఏర్పాటు చేయబడి ఉండాలి.

ఇతర వివరాలు, వాహనాల స్పెసిఫికేషన్స్, రూట్‌లు/ బ్రాంచ్ వివరాలకై **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, CAC కడప** గారిని ఫోన్‌లోగాని, స్వయంగాగాని సంప్రదించగలరు.

ఫోన్: 9885388362.

తేది: 31.01.2025 **సం/- శాఖానిర్వహణాధికారి,**

ప్రదేశం : కడప. **భారతీయ స్టేట్ బ్యాంక్, CAC బ్రాంచ్ కడప.**